# సాక్షి సూర్యాపేట

బుధవారం, 31, మే, 2023






**నృసింహుడి నిత్య కల్యాణం**

శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనర సింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. - 8లో



**ధూమ'ప్రాణం' తీస్తోంది**

చాలామంది సరదాగా పొగ తాగడం మొదలుపెట్టి క్రమంగా దానికి బానిసలవుతున్నారు. - 8లో

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం 40° / 28°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నేడు డయల్ యువర్ డీఎం

**భానుపురి (సూర్యాపేట) :** ఆర్టీసీ అందిస్తున్న సేవలు, అంతరాయాలతో పాటు మెరుగైన వసతుల కోసం సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడేందుకు బుధవారం ఉదయం 11గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9959226306 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సర్వీసులకు సంబంధించిన సలహాలు, సూచనలు చేయాలని కోరారు.

### దండుమైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**ఆత్మకూర్ (ఎస్) :** మండల పరిధిలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయ హుండీని మంగళవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. 67రోజులకు గాను రూ.2,51,769 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ కుశలయ్య తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### జూన్ 4న కొత్తగూడెంలో సీపీఐ బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**హుజూర్‌నగర్:** సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గన్నా చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలోని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేసేందుకు సీపీఐ కృషిచేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఐ ప్రభావం లేకుండా ఎన్నికలు రాజకీయాలు ఉండవనిన ఆయన చెప్పారు. మతతత్వ, కులతత్వ రాజకీయాలను ఎదిరించేందుకు బలమైన ప్రత్యామ్నాయం సీపీఐ మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, వై రమేష్, ఎస్ కష్ణ, జె వెంకన్న, ఎం వెంకయ్య, పి వాసుదేవ రావు, జె శ్రీనివాస్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు అడ్లూరు ఉప సర్పంచ్‌పై అవిశ్వాసం

**కోదాడరూరల్ :** మండల పరిధిలోని అడ్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ మృతి చెందడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న లచ్చిరెడ్డి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అయితే, బీఆర్ఎస్ గ్రామ కమిటీలో ఉన్న వర్గ పోరుతో లచ్చిరెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు వ్యతిరేకవర్గం వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 17న అవిశ్వాసం ఏర్పాటు చేశారు. ఆ రోజు ఆర్డీఓకు జ్వరం రావడంతో వాయిదా వేశారు. తిరిగి బుధవారం అవిశ్వాసం పెడుతున్నట్లు సంబధిత అధికారులు, వార్డు సభ్యులకు నోటీసులు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా గ్రామంలో పోలీసులు 144 సెక్షన్ పెట్టారు.

### తెలంగాణలో మహిళలకు భద్రత కరువు



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు భద్రత, రక్షణ కరువైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఎక్కడ చూసినా మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళనవ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రలో జరిగిన బీజేపి మహిళా మోర్చా పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడబిడ్డల పుస్తెలు తెంపడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రోజు రోజుకూ ప్రజలను మద్యానికి బానిస చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకుంటూ పోతున్నారని విమర్శించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బూర శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ కరణం పరిణీత, అయినాపురపు శ్యామల గౌరి, కౌన్సిలర్లు సలిగంటి సరిత, పలస మహాలక్ష్మి, నాగారపు మనేమ్మ, గరిగంటి సమత, దోసకాయల మౌనిక, మీరు పర్వీన్ పాల్గొన్నారు.

● కమ్మేసిన కారుమబ్బులు



సూర్యాపేట పట్టణాన్ని మంగళవారం కారుమబ్బులు కమ్మేశాయి. కొద్దిరోజులుగా 45డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాగా ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం ఉపశమనం కలిగించింది. కారుమబ్బులు కమ్ముకోవడంతో జిల్లా కేంద్రం చీకటిమయం కాగా చిరుజల్లులతో పాటు వీచిన చల్లటి గాలులు పట్టణవాసులను ఉల్లాసపరిచాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

## జల పుష్పాల పంపిణీ లక్ష్యం 3.50కోట్లు

- సెప్టెంబర్ నాటికి చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు
- చిన్న చెరువుల్లో 35- 40ఎంఎం, పెద్దచెరువుల్లో 80-100 ఎంఎం పరిమాణం గల చేప పిల్లలు వదిలేందుకు నిర్ణయం
- పంపిణీకి ముందు చెరువుల స్థితిగతుల పరిశీలన
- నేటితో ముగియనున్న టెండర్ల గడువు



చిలుకూరు మండలం బేతవోలు చెరువులో చేపపిల్లలు పోస్తున్న అధికారులు (ఫైల్)

**చిలుకూరు :** ఉచిత చేప పిల్లల పంపిణీ లక్ష్యాన్ని మత్స్యశాఖ నిర్దేశించింది. గత సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా జిల్లాలోని 850 చెరువుల్లో 3.50కోట్ల జలపుష్పాలను వదలాలని అధికారులు నిర్ణయించారు. చేప పిల్లలను సకాలంలో అందజేసేందుకు మత్స్యశాఖ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు టెండర్లను ఆహ్వానించింది. నేటి(బుధవారం)తో టెండర్ల గడువు పూర్తికానుంది. టెండర్లు పూర్తయితే సెప్టెంబర్ నాటికి చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**జియో ట్యాగింగ్ చేసిన చెరువులు 670**

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల పరిధిలో 850 చెరువులు ఉన్నాయి. అయితే, వీటిలో జియో ట్యాగింగ్ చేసిన చెరువులు 670 ఉన్నాయి. మొదటి నుంచి వివిధ కారణాలతో మిగిలిన చెరువులు ట్యాగింగ్ పూర్తి కాలేదు. అయినా, దాదాపుగా 850 చెరువుల్లో చేపలు పోసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతో మత్స్య సంపద ఉత్పత్తి భారీగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. చిన్న చెరువుల్లో 35 ఎంఎం నుంచి 40 ఎంఎం పరిమాణం గల చేప పిల్లలు, పెద్ద చెరువుల్లో 80 ఎంఎం నుంచి 100 ఎంఎం సైజు ఉన్న చేపపిల్లలు వదలనున్నారు. జిల్లా వ్యాప్తంగా మత్స్యకార సంఘాలు 1,056 ఉండగా వాటిల్లో సభ్యులు 17,500 మంది ఉన్నారు. అయితే, పలు చెరువుల్లో ఇంకా నీళ్లు తగ్గకపోవడంతో పాటు కంపచెట్లు ఏపుగా పెరగడం లాంటి కారణాలతో చేపల వేట మొదలు కాలేదు. చేపలు పట్టిన చోట మాత్రం ఉత్పత్తి మందిగానే ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**జిల్లాలో ఇలా..**

| | |
|---|---|
| చెరువులు | 850 |
| జియోట్యాగింగ్ చేసినవి | 670 |
| మత్స్యసహకార సంఘాలు | 1,056 |
| సంఘాల్లోని సభ్యులు | 17,500 |

**సకాలంలో చేప పిల్లలు పంపిణీ చేస్తాం**



"సకాలంలో ఉచిత చేప పిల్లల పంపిణీకి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది కూడా జిల్లాలోని 850 చెరువుల్లో 3.50 కోట్లు చేప పిల్లలు పంపిణీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు సంబంధించి బుధవారంతో టెండర్ల ప్రక్రియ పూర్తివుతుంది. ఈ సారి చేప పిల్లల పంపిణీకి ముందే చేపల చెరువుల స్థితిగతులను పరిశీలిస్తాం.

– రూపేందర్‌సింగ్, మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట

**చేపల వేటకు గుర్రపుడెక్క ఆటంకం**

ఈ ఏడాది చేప పిల్లల పంపిణీకి ముందు సంబంధిత అధికారులు చెరువుల స్థితిగతుల్ని పరిశీలించనున్నారు. చెరువుల్లో మత్స్య సంపద పెరిగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. పలు చెరువుల్లో పూడిక పెరిగి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. దీనికి తోడు చెరువుల్లో పిచ్చి మొక్కలు బాగా పెరుగుతున్నాయని, గుర్రపు డెక్క ఆకు విపరీతంగా పెరిగి చేపల వేట కూడా ఇబ్బందిగా ఉందని అంటున్నారు. ఉదాహరణకు చిలుకూరు మండలం నారాయణపురం చెరువులో గుర్రపు డెక్క ఆకు ఎక్కువగా ఉండి కనీసం చేపలు పట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. పలు మార్లు చేపల వేటకు అంతరాయం ఏర్పడింది. ఇదే పరిస్థితి చాలా చెరువుల్లో నెలకొంది. చేప పిల్లలు పంపిణీ చేయడంతో పాటు వాటి వేటకు కూడా ఏర్పాట్లు చేయాలని పలువురు మత్స్యకారులు కోరుతున్నారు.



నారాయణపురం చెరువును కమ్మేసిన గుర్రపుడెక్క

## బడిబాటకు వేళాయే

- జూన్ 3 నుంచి 17వ తేదీ వరకు పాఠశాలల్లో కార్యక్రమాలు
- అత్యధిక నమోదు పాఠశాలల ఉపాధ్యాయులకు సన్మానం
- ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయనున్న టీచర్లు



జిల్లా కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

**సూర్యాపేటటౌన్ :** ప్రభుత్వ పాఠశాలను మరింత బలోపేతం చేయడం, అడ్మిషన్ల సంఖ్యను గణనీయంగా పెంచడమే లక్ష్యంగా జూన్ 3వ తేదీ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఈ ఏడాది విద్యార్థుల నమోదుపైనే అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. జూన్ 3 నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, 12నుంచి 17వ తేదీ వరకు రోజు వారీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు ఉపాధ్యాయులు ఆయా గ్రామాలోని విద్యార్థుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితర వాటి గురించి వివరించనున్నారు. జిల్లాలో 950 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.

**విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్**

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది రెండుగా విభజించారు. జూన్3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కేవలం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు. ఆ తర్వాత జూన్ 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా టీచర్లంతా ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు ఈ డ్రైవ్‌ను చేపట్టి.. డోర్ టు డోర్ క్యాంపెయిన్, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ చేపడతారు. ఇంగ్లిష్ మీడియం చదువు, మన ఊరు మన బడి వంటి కార్యక్రమాల ప్రాధాన్యాన్ని వివరిస్తారు. బాల కార్మికులు, బడిబయట ఉన్న చిన్నారులను నమోదు చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

**లక్ష్యాలు ఇవే..**

బడి ఈడు పిల్లల గుర్తింపు, సమీప పాఠశాలల్లో నమోదు చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచడం, గుణాత్మక విద్యను అందించడం. సమాజ భాగస్వామ్యం మద్దతుతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పైబడిన పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించడం. తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళిక ద్వారా తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నమోదు పెంచడం. బడి బయట పిల్లలను గుర్తించి వారి వయసుకు తగిన తరగతిలో నమోదు చేయిస్తారు.

**జిల్లా స్థాయిలో మూడు.. రాష్ట్ర స్థాయిలో పది పాఠశాలలు ఎంపిక**

బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి విద్యార్థులను అధికంగా నమోదు చేసిన పాఠశాలలను జిల్లా స్థాయిలో మూడు, రాష్ట్ర స్థాయిలో పది పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులను సన్మానించనున్నారు. పాఠశాల స్థాయిలో జూన్ 1వ తేదీన సన్నాహక సమావేశం నిర్వహించుకోనున్నారు. బడిబాట నిర్వహణకు అవసరమైన కరపత్రాలు, బ్యానర్‌లు తదితర ఏర్పాట్లు చేసుకోవాలి.

## ఆలయ భూమి ఆక్రమణకు యత్నం

- అధికారపార్టీ నేత నిర్వాకం
- రామిరెడ్డిపాలెం వాసుల ఆందోళన
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



దేవాలయ భూమిలో మట్టిపోసి చదును చేస్తున్న ఆక్రమణదారులు

**కోదాడ:** కోదాడ పట్టణ సమీపంలో రామిరెడ్డిపాలెం రోడ్డులో ఉన్న అనంతగిరి రంగనాథస్వామి ఆలయ భూమిని ఆక్రమించడానికి అధికారపార్టీకి చెందిన ఓ నేత ప్రయత్నం చేయడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి దేవాలయానికి రామిరెడ్డిపాలెం రోడ్డులో సర్వే నంబర్ 1024, 1025లో 24ఎకరాల భూమి ఉంది. దీనిలో 5 ఎకరాల భూమిలో పేదలకు ఇందిరమ్మ కాలనీ నిర్మాణం చేశారు. ఈ క్రమంలో మంగళవారం కొమరబండకు చెందిన అధికార పార్టీ నేత ట్రాక్టర్లతో కాలనీ సమీపంలో ఉన్న దేవాలయభూమిలో ఉన్న గుంటలను మట్టితో నింపి చదును చేయసాగాడు. దీని కోసం అదే దేవాలయానికి చెందిన భూమిలో ఉన్న గుట్టల్లోని మట్టి తరలించాడు. దీనిని స్థానికులు అడ్డుకొని దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈఓ చలపతి, జూనియర్ అసిస్టెంట్ శంభిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అక్కడి నుంచి పంపించారు.

**అధికారుల తీరుపై విమర్శల వెల్లువ**

దేవాలయభూమిని యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లిన సమయంలో ట్రాక్టర్లు, డోజర్లు అక్కడే ఉన్నాయి. ఆక్రమిస్తున్న వారు అక్కడే ఉన్నారు. దీనిపై కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయడం, సంఘటనా స్థలంలో ఉన్న వాహనాలను సీజ్ కూడా చేయకపోవడం వెనుక అధికారపార్టీ నేతలతో కుమ్మక్కయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- జిల్లా ప్రత్యేక అధికారి సుదర్శన్‌రెడ్డి
- రాష్ట్ర అవతరణ ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష
- సమన్వయంతో పనిచేయాలని సూచన



సమావేశంలో పాల్గొన్న ప్రత్యేక అధికారి సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ వెంకట్రావ్, తదితరులు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిలా ప్రత్యేక అధికారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌లతో కలసి మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి జూన్ 2 నుంచి 22వరకు అన్ని కార్యక్రమాలు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో విజయవంతం చేయాలని సూచించారు. శాఖల వారీగా చేపట్టబోయే కార్యక్రమాలపై స్పష్టత ఉండాలని, అధికారులందరూ నిబద్ధత, సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఉత్సవాల నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. జూన్ 2న గ్రామ, మండల స్థాయిలో జాతీయ పతాక ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అదే రోజు అమరులస్థూపం వద్ద నివాళులు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయిలో అమరులకు నివాళులు, మంత్రి సందేశం అలాగే వివిధ శాఖల స్టాల్స్, శకటాలు ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ ఉంటాయని తెలిపారు. 20రోజుల పాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ కార్యాక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. జూన్22న అమరుల సంస్మరణతో కార్యక్రమాల ముగింపు ఉండనుందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్, పీడీ కిరణ్ కుమార్, డీపీఓ యాదయ్య, డీఏఓ రామారావు నాయక్, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కార్మికవర్గాన్ని అణచివేస్తున్న కేంద్రం



జెండా ఆవిష్కరిస్తున్న రత్నాకరం కోటంరాజు

**హుజూర్‌నగర్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గాన్ని అణచివేస్తోందని బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటంరాజు ఆరోపించారు. మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్‌లోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో అనేక పోరాట ఫలితంగా కార్మిక చట్టాలను హక్కుల్ని సాధించామన్నారు. కేంద్రం కార్మిక చట్టాలను రద్దు చేయడమే కాకుండా కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు అనుకూలమైన లేబర్ కోడ్‌లను సృష్టిస్తుందని ఆరోపించారు. రాబోయే కాలంలో ఐక్యంగా పోరాడి హక్కులు సాధించే దిశగా కార్మిక వర్గం పనిచేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్కా సోమయ్య గౌడ్, జిల్లా నాయకులు సీహెచ్ జయకృష్ణ, వెంకన్న, రామకృష్ణ, వేణు, వెంకన్న, శాంమ్, అశోక్, అక్బర్, అఖిల్, సురేష్ వెంకన్న ప్రభాకర్ పాల్గొన్నారు.

## పండుగలా దశాబ్ది ఉత్సవాలు

- తొమ్మిదేళ్ల ప్రగతి ప్రతిబింబించాలి
- సన్నాహక సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కలెక్టర్లు వెంకట్రావ్, వినయ్‌కృష్ణారెడ్డి, పమేలా సత్పతి, యాదాద్రి జెడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, ఎమ్మెల్యేలు

**సాక్షి,యాదాద్రి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమరుల ఆశయాలకు అనుగుణంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు విశ్వాసం కలిగించామని, టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పి లక్షలాది మందికి ఉపాధి కల్పించామన్నారు. తలసరి ఆదాయంలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. జూన్ 2నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలు, ప్రగతిని ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా కార్యక్రమాలు ఉండాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరినీ భాగస్వాములను భాగస్వాములను చేయాలని కోరారు.

**2లోగా నివేదికలు సమర్పించాలి**

తొమ్మిదేళ్లలో జిల్లా సాధించిన ప్రగతిపై శాఖల వారీగా నివేదికలు తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. నివేదికలను 2వ తేదీ లోపు ప్రజాప్రతినిధులందరికీ సమర్పించాలని కోరారు. తెలంగాణ రైతు దినోత్సవం మొదలుకొని జూన్ 22వ తేదీ వరకు గ్రామ, మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో రోజుకో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. కవులు, గిరిజనులను సత్కరించాలని సూచించారు. తొమ్మిదేళ్ల పరిస్థితిపై ప్రతి శాఖ ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారినే అవార్డులకు ఎంపిక చేయాలని స్పష్టం చేశారు.



హాజరైన ఎస్పీలు రాజేంద్రప్రసాద్, అపూర్వరావు, డీసీపీ రాజేశ్‌చంద్ర తదితరులు

**అందరూ సహకరించాలి**

దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు చేపడుతున్న చర్యలను ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, టి.వినయ్‌కృష్ణారెడ్డి, వెంకట్‌రావు, ఎస్పీలు అపూర్వరావు, రాజేంద్రప్రసాద్, డీసీపీ రాజేశ్‌చంద్ర వివరించారు. 2నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాలు, చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులకు సూచనలు చేసినట్లు చెప్పారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు,కార్పొరేషన్ చైర్మన్‌లు



సూర్యాపేట జిల్లా అధికారులు

## క్లుప్తంగా

### వైన్స్ వద్ద కిందపడి వ్యక్తి మృతి

కోదాడరూరల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి వైన్స్ ఎదుట కిందపడి మృతిచెందిన ఘటన కోదాడ పట్టణ పరిధిలోని మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన కొమ్మబట్ల వెంకటకృష్ణ(45) అవివాహితుడు. పూర్తిగా మద్యానికి బానిసైన అతడు మంగళవారం పట్టణంలోని ఓ వైన్స్ వద్దకు వెళ్లి మద్యం తాగి పక్కనే కిందపడ్డాడు. కొద్దిసేపటి తర్వాత స్థానికులు గమనించి కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నాగేంద్రప్రసాద్ (ఫైల్)

చిలుకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలంలోని దూదియాతండా గ్రామానికి చెందిన భూక్యా నాగేంద్రప్రసాద్ (35)ఆదివారం పని నిమిత్తం బైక్‌పై చిలుకూరుకు వచ్చి గ్రామానికి తిరిగి వెళ్తుండగా మార్గ మధ్యలో అదుపుతప్పి బైక్ పైనుంచి కింద పడడంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కోదాడకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ వైద్యశాలకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు

భువనగిరి: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని ఆర్బీనగర్‌లో కొందరు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి సంజీవనగర్‌కు చెందిన మంచాల సంతోష్, శ్రీరాంనగర్‌కు చెందిన చాట్ల సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరు సోమవారం గుజరాత్-చెన్నై మధ్య జరిగిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా డఫాబెట్ అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేసి రూ.4300 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కల్లూరు: ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పేరువంచ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా కోదాడ మండలం బండపాలెం తమ్మరకు చెందిన ముగ్గురు యువకులు ఓ శుభకార్యం నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో బంధువుల ఇంటికి సోమవారం వెళ్లారు. అక్కడి నుంచి మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వస్తుండగా కల్లూరు మండలం పేరువంచ సమీపాన తిరువూరు వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో షేక్ అజిత్, షేక్ సమీర్, షేక్ హమీద్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వచ్చిన వారి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు.

# ధూమ‘ప్రాణం’ తీస్తోంది

- సిగరెట్ తాగేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- పొగ తాగడం మానేస్తే అనేక ఉపయోగాలు
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం



తిరుమలగిరి (తుంగతుర్తి): చాలామంది సరదాగా పొగ తాగడం మొదలుపెట్టి క్రమంగా దానికి బానిసలవుతున్నారు. సిగరెట్లు, బీడీలు, చుట్టలు తాగిన మరుక్షణం నుంచే శరీరంలోని అన్ని అవయవాల మీద తీవ్ర ప్రభావం చూపటం మొదలుపెడతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా జరుపుతున్న నేపథ్యంలో ×మనకు కావాల్సింది ఆహారం కాని పొగాకు మాత్రం కాదు¥ అనే నినాదంతో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్త్ సెంటర్లలో, ఆరోగ్య ఉప కేంద్రాలలో ధూమపానం వల్ల కలిగే దుష్పరిణామాలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1800112356కు కాల్ చేస్తే ధూమపానం మానేయడానికి ఉచిత సూచనలు, సలహాలు అందిస్తారు.

**పొగాకు అలవాటు కావడానికి కారణాలు**

సిగరెట్‌లో ఉండే నికోటిన్ మనిషి మెదడులో సంతోషం, హుషారు లాంటి భ్రాంతిని కలుగజేస్తాయి. దానినే మళ్లీ మళ్లీ కోరుకుంటూ సిగరెట్‌కు అలవాటు పడిపోతుంటారు. ఒకసారి మెదడుకు నికోటిన్ ఇచ్చే భ్రాంతి భావనలకు అలవాటుపడ్డ తర్వాత వాటిని వదిలిపెట్టేందుకు అంత తేలిగ్గా ఒప్పుకోదు. అందుకే సిగరెట్ తాగే అలవాటును అంత త్వరగా మానలేరు. అంతేకాకుండా ధూమపానం మానేయగానే ఒకరకమైన ఉద్విగ్నత, ప్రశాంతంగా ఉండలేక, వేగంగా కోపం తెచ్చుకోవడం, స్థిమితంగా ఉండలేకపోవడం వంటి తప్పుడు భ్రాంతులను కలుగజేస్తుంది. దీంతో సిగరెట్ గాని, పొగాకు వాడటం గాని మానేస్తే తమకేదో నష్టం కలుగుతుందన్న భ్రాంతి కలుగజేస్తుంది. సిగరెట్ వెలిగించగానే నోరు, గొంతు, ముక్కు, తలపై అది తన దుష్ప్రభావాన్ని చూపడం మొదలు పెడుతుంది. నోరు, గొంతులోని సున్నితమైన భాగాలు మందంగానూ, గరుకుగానూ మారిపోతాయి. ఇది కాస్త ఆయా భాగాలకు క్యాన్సర్ వచ్చేందుకు ఒక ముప్పుగా పరిణమిస్తుంది. పొగను పీల్చగానే ఊపిరితిత్తుల్లో ఆక్సిజన్ తగ్గుతుంది. ఆ పొగ వల్లనే అత్యంత హానికరమైన కార్బన్ మోనాక్సైడ్ మోతాదు పెరుగుతుంది. ఫలితంగా రక్తం ద్వారా వివిధ అవయవ భాగాలకు అందాల్సిన ఆక్సిజన్ అందదు. ఈ కణాలన్నింటిలో హానికరమైన కార్బన్ డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ చేరి రక్తం గడ్డకట్టి గుండెపోటు, పక్షపాతం వచ్చే అవకాశాలు ఉంది. పొగాకుతో రక్తనాళాలు సన్నబడతాయి. గుండె, మెదడుకు వెళ్లే రక్తనాళాలు సన్నబడటం వల్ల గుండెపోటు, పక్షపాతం రావచ్చు.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**

సిగరెట్ పొగలో దాదాపు 4వేల రకాల హానికరమైన రసాయనాలు, 60 రకాల ట్రాన్సినోజెన్స్ ఉంటాయి. ఫలితంగా ఊపిరితిత్తులు, స్వర పేటిక, ప్రొస్టేట్, మూత్రాశయం, మూత్ర పిండాలు, జీర్ణకోశ క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. పొగ తాగడం వల్ల జీర్ణకోశం, అన్నకోశాల్లో అల్సర్ రావొచ్చు. పురుషుల్లో సెక్స్ సామర్థ్యం, పిల్లలు పుట్టే సామర్థ్యం పైన ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**పొగ తాగడం మానేయాలి**



పొగ తాగడం మానేయడం వల్ల మంచి ఆరోగ్యంగా ఉంటారు. జబ్బులు రావడానికి అవకాశం తక్కువగా ఉంటుంది. సిగరెట్ తాగడం వల్ల హార్ట్‌ఎటాక్ రావడానికి 50శాతం అవకాశం ఉంటుంది. సిగరెట్ మానేయడం వల్ల జీవిత కాలం పెరుగుతుంది.
– డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి

**ధూమపానం మానేయడం వల్ల ఉపయోగాలు**

- 128 గంటల్లోపు రక్త ప్రసరణ సాధారణ స్థితికి చేరుకుంటుంది.
- 24 గంటల్లో నికోటిన్ శరీరం నుంచి తొలగిపోతుంది.
- 48 గంటల్లో వాసన, రుచి, ఇంద్రియాల పనితీరు మెరుగవుతుంది.
- 78 గంటల్లో శ్వాసక్రియ వృద్ధి చెందుతుంది.
- 9 నెలల లోపు దగ్గు పది శాతం తగ్గిపోతుంది.
- 12 నెలల లోపు గుండె జబ్బుల ప్రభావం 50శాతం తగ్గిపోతుంది.
- పది సంవత్సరాల లోపు ఊపిరితిత్తుల క్యాన్సర్ 50 శాతానికి తగ్గిపోతుంది.

## పెళ్లైన 19 రోజులకే యువకుడు దుర్మరణం

- బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి
- కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఘటన


వెంకటేశ్ (ఫైల్)

కొండమల్లేపల్లి: పెళ్లైన 19 రోజులకే నవ వరుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల గ్రామానికి చెందిన బొడ్డుపల్లి శ్రీనివాస్, అలివేలు దంపతుల ఏకైక కుమారుడు బొడ్డుపల్లి వెంకటేశ్(29) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 11న వెంకటేశ్‌కు గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. పెళ్లి తర్వాత తిరిగి ఉద్యోగానికి వెళ్తున్న వెంకటేశ్ ఆదివారం సెలవు దినం కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. కాగా పెండ్లిపాకల గ్రామంలో బొడ్రాయి ఉత్సవాలు ఉండడంతో సెలవులు పెట్టేందుకు సోమవారం వెంకటేశ్ స్వగ్రామం నుంచి బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరి ఆఫీస్ పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి పయనయ్యాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కొండమల్లేపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ మూలమలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఈ ఘటన జరగడంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. పెళ్లైన కొద్దిరోజులకే రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి

**పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు..**

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బొడ్డుపల్లి వెంకటేశ్ బీజేపీలో కొనసాగుతూ పెండ్లిపాకల గ్రామంలో 135వ బూత్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. వెంకటేశ్ మరణ వార్త తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్‌కుమార్, లాలునాయక్, బొడిగ సాంబశివగౌడ్, పేర్ల జితేందర్, భరత్‌కుమార్, కుంభం యాదగిరి, పాక నగేశ్, బోడ కృష్ణ, చిలువేరు శ్రీధర్, ఎండీ జహీర్, తారయ్య తదితరులున్నారు.

## వైభవంగా నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహగ్నిహోత్రి, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, రక్షాభంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ గావించారు. కాగా, క్షేత్ర పాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూర్లు విజయ్‌కుమార్, చెన్నూరుమట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

## యాదాద్రి హుండీల ఆదాయం రూ.2.28కోట్లు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను మంగళవారం కొండ కింద గల శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో భాగంగా రూ.2,28,25,714 నగదు, 95 గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల 700 గ్రాములు మిశ్రమ వెండి వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. వీటితో పాటు 657 అమెరికన్ డాలర్లు, 15 ఆస్ట్రేలియన్ డాలర్లు, 12 సింగపూర్ డాలర్లు, 15 కెనడా డాలర్లు, 40 యూఏఈ దీర్హామ్స్, 57 మలేషియా రింగిట్స్, 400 ఒమాన్ రియాల్స్, 10 ఇంగ్లాండ్ పౌండ్లు, 20 యూరోలు, 20 ఖతార్ రియాల్స్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఆదాయం 19 రోజులదని ఈఓ తెలిపారు.

## వెల్లంకిలో ‘బలగం’ నటీనటుల సందడి


బలగం సినిమా నటీనటులను సన్మానిస్తున్న వెల్లంకి గ్రామస్తులు

రామన్నపేట: బలగం చిత్ర నటీనటులు మంగళవారం సాయంత్రం రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో సందడి చేశారు. గ్రామానికి చెందిన కందాల సురేష్ నూతనంగా నిర్మించనున్న చిత్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఎల్లమ్మ పండుగ నిర్వహించారు. దీంతో బలగం సినిమా నటీనటులను ఆహ్వానించి తన తల్లితండ్రులు కేశవులు-యాదమ్మ చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో నటీనటులు నకిరేకంటి రమేష్(నిధానపల్లి), కొమరయ్య పాత్రధారి సుధాకర్‌రెడ్డి, సంజయ్‌క్రిష్ణ, పోతుగంటి సహదేవ్, కొమ్ము సుజాత, పవిత్ర, విద్యాసాగర్, అంజనాచౌదరి, రుక్సానాబేగం, తేజు, గణేష్, అంజిరెడ్డి, సుధాకర్, కావ్యారెడ్డి, సుహాసిని, సీనియర్ కోడైరెక్టర్ బాలరాజు, కమెడియన్ కర్ణానందం ఉన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మల్లయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మునుగోడు: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కొరటికల్ గ్రామానికి చెందిన టమాటల మల్లయ్య(62) మంగళవారం తన ఇంట్లోని మంచినీటి బోరు మోటారుకు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మోటారుకు విద్యుత్ సరఫరా అయ్యే స్విచ్ ఆఫ్ చేయకుండా వైర్లని కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికి అక్కడే మృతిచెందాడు. రేషన్ బియ్యం కోసం వెళ్లిన భార్య తిరిగి ఇంటికి వచ్చే సమయానికి మల్లయ్య విగతజీవిగా పడి ఉండటంతో ఆమె బోరున విలపించింది. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

## బెట్టింగ్‌లకు పాల్పడి యువకుడి ఆత్మహత్య


రాజుగౌడ్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అధిక మొత్తంలో డబ్బులు పోగొట్టుకుని పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపురం గ్రామానికి చెందిన శిఖ రాజుగౌడ్(22) కారు డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఐపీఎల్ సీజన్ కావడంతో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ పెట్టి అధిక మొత్తంలో డబ్బు పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన రాజుగౌడ్ జీవితంపై విరక్తితో సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. అనంతరం తాను పురుగు మందు తాగినట్లు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి తండ్రి శిఖ నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

## తెలంగాణ ప్రగతిని చూసి ప్రపంచమే నివ్వెరపోతోంది

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి: తెలంగాణ రాష్ట్ర ప్రగతిని చూసి ప్రపంచమే నివ్వెరపోతోందని, ప్రపంచ వ్యవసాయ రంగ నిపుణులు, రైతు ఉద్యమకారులకు ఆశ్చర్యం కలిగించే విధంగా తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వ్యవసాయ రంగంలో ఎక్కువగా లాభపడిన జిల్లా ఉమ్మడి నల్గొండ జిల్లా అన్నారు. ఉమ్మడి జిల్లా గత 4 సంవత్సరాలుగా 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా ఎదిగిందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ ప్రణాళికలు మార్చుకోవాలని అన్నారు. రైతాంగానికి ఇప్పటికే 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ప్రాజెక్టుల్లో, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉందన్నారు. రాష్ట్ర సాధన సమయంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషిచేశారని అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జడల అమరేందర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య ఉన్నారు.

## వ్యవసాయమే అన్నిరంగాలకు మూలాధారం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేవీకే కంపాసాగర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హాలియా: వ్యవసాయమే అన్నిరంగాల మనుగడకు మూలాధారమని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం హాలియా మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో వివిధ పంటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయరంగం దయనీయ స్థితిలో ఉందన్నారు. ఇష్టానుసారంగా పురుగుల మందుల వాడకం వలన నేల దాని సారం కోల్పోతుందని, దీంతో ప్రకృతి విపత్తులు కూడా చోటుచేసుకుంటున్నాయన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని అందుకు తగ్గట్టుగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించి సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శివప్రసాద్ వరి, పత్తి విత్తనాల కొనుగోళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిమ్మ, బత్తాయి తోటల సాగులో మెలకువలు, నేలల సంరక్షణ, పురుగులు, తెగుళ్లు, చీడపీడల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతులు అడిగిన పలు ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి, తిమ్మాపురం ఉప సర్పంచ్ తుమ్మరగోటి రమేష్, రైతులు, రైతు సంఘం నాయకులు, ఏకే ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులు భూసారాన్ని కాపాడుకోవాలి


మట్టి నామునా సేకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

పెన్‌పహాడ్: భూసారాన్ని కాపాడుకుంటే పర్యావరణానికి మేలు జరుగుతుందని గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో గల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎ. కిరణ్ అన్నారు. గడ్డిపల్లి కేవీకే ఆధ్వర్యంలో మంగళవారం పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో రైతులకు మట్టి నమూనా సేకరించే విధానం, వాటి ఫలితాల ఆధరంగా ఎరువుల వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీ వరకు భూసార పరీక్షలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు నేలలోని పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం వలన ఏ నేలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా భూసార పరీక్షల ద్వారా నేలలో ఏఏ పోషకాలు తగ్గాయో ఆ పోషకాలను మాత్రమే నేలకు అందించడం వలన ఖర్చును కూడా తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట ప్రాముఖ్యత, సేంద్రియ పద్ధతుల్లో భూసారాన్ని పెంచే అంశాలతో పాటు మట్టి నమూనా సేకరించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్ నరేష్, రైతులు కె. వెంకన్న, పి. చంద్రశేఖర్, కోటయ్య, ఎల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో నవజాత శిశువు మృతి

- డాక్టర్ లేకపోవడంతో నర్సులే కాన్పు చేశారని బంధువుల ఆరోపణ


నవజాత శిశువు మృతదేహం

కోదాడ: కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ఉదయం అప్పుడే పుట్టిన శిశువు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నర్సులే కాన్పు చేశారని, అందువల్లే తమ బిడ్డ మృతిచెందిందని తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం వెంకట్రాంపురానికి చెందిన మానస రెండు రోజుల క్రితం డెలివరీ కోసం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. మంగళవారం తెల్లవారుజామున ఆమెకు పురిటినొప్పులు రాగా, ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నర్సులే తెలిసీతెలియక కాన్పు చేయడంతో పుట్టిన శిశువు మరణించిందని బంధువులు ఆరోపించారు. డెలివరీ చేసిన వెంటనే బిడ్డ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లమని చెప్పారని, అప్పటికే శిశువు మృతిచెందిందని ఆరోపిస్తున్నారు. దీనిపై వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది మాత్రం నోరు విప్పడం లేదు. ఈ ఘటనపై వైద్యశాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.

## భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డికి పితృ వియోగం



చెన్నకృష్ణారెడ్డి (ఫైల్)

నాగారం, భువనగిరి: భువనగిరి ఏసీపీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి తండ్రి సైరెడ్డి చెన్నకృష్ణారెడ్డి (95) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. భువనగిరిలో కుమారుడితో కలిసి ఉంటున్న చెన్నకృష్ణారెడ్డి ఆరోగ్యం ఆకస్మాత్తుగా క్షీణించడంతో వెంటనే యాదాద్రి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించే లోపు ఆయన మృతిచెందారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన చెన్నకృష్ణారెడ్డి సీపీఐ నాయకుడిగా ఉంటూ దివంగత భీంరెడ్డి నర్సింహారెడ్డితో కలిసి తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేశారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో చెన్నకృష్ణారెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నకృష్ణారెడ్డి మృతిపట్ల భువనగిరి డీసీపీ ఎం. రాజేష్‌చంద్ర, భువనగిరి పట్టణ సీఐ సత్యనారాయణ, తిరుమలగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యారాల రాంరెడ్డి, బండగొర్ల ఎల్లయ్యతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

## వర్షంతో ఉపశమనం

యాదగిరిగుట్ట: భానుడి భగభగకు అతలాకుతలం అవుతున్న యాదగిరిగుట్ట పట్టణ ప్రజలతో పాటు యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తులకు మంగళవారం కాస్త ఉపశమనం లభించింది. వేకువజామున 4గంటల నుంచి ఉదయం 9గంటల వరకు యాదగిరిగుట్టలో వర్షం కురిసింది. దీంతో సుమారు రెండు నెలల పాటు భానుడి ప్రతాపానికి విలవిల్లాడిన ప్రజలు, భక్తులు కాస్త ఉపశమనం పొందారు. సుమారు 5గంటల పాటు కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వర్షం పడుతున్న సమయంలో భక్తులు శ్రీస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. వర్షం తగ్గుముఖం పట్టిన తర్వాత పట్టణ రోడ్లపై, ఆలయ పరిసరాల్లో ప్రజలు, భక్తులు కనిపించారు.


యాదాద్రి ఆలయ పరిసరాల్లో కురిసిన వర్షం



## అందం.. ఆహ్లాదం

మండు వేసవిలోనూ భువనగిరి ఖిలా పచ్చందాలను సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కోటపై ఉన్న చెట్లు చిగురించి పచ్చని తివాచీ పరిచినట్లుగా కనువిందు చేస్తున్నాయి. మరోవైపు పక్కనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూపుదిద్దుకుంటున్న క్రికెట్ మైదానం, భవనాలతో కూడిన పట్టణ ఫొటోలు మంగళవారం వాట్సప్‌లో చక్కర్లు కొట్టాయి.
-భువనగిరి